మోడీ నాలుగేళ్ల దుష్పరిపాలన

# జీవితాలకు, భవిష్యత్తుకు ప్రమాదం

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి,

గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202, 9490098042

ప్రథమ ముద్రణ : జూన్, 2018

వెల : ₹ 15/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,
విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,
ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

135313

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ❖ | ముందుమాట | 5 |
| ❖ | విద్య : ప్రయివేటు దురాశ, కాషాయ ఎజెండా | 10 |
| ❖ | ఆరోగ్యం : కుబేరులవుతున్న కార్పొరేట్లు, అనారోగ్యంలో జనం | 15 |
| ❖ | మోడీ ప్రభుత్వ పాలనలో మరింతగా పెరిగిన ఆహార అభద్రత | 20 |
| ❖ | పర్యావరణ విధ్వంసం | 24 |
| ❖ | నిజమైన శాస్త్రజ్ఞానాన్ని అణగదొక్కుతూ కుహనా శాస్త్రజ్ఞానానికి ప్రచారం. | 29 |

# ముందు మాట

**ఈ** ప్రచురణలో మోడీ పాలనకు సంబంధించిన నాలుగు అంశాలను విడివిడిగా ముద్రిస్తున్నాము. 2015 లో మోడీ పాలన మొదలయిన నాటి నుంచి నేటి వరకూ పాలనలో లోపాలను ఎత్తిచూపుతూ వేసిన సీరీస్‌లో ఇది నాల్గవది.

ప్రజల సొమ్ముతో తన పాలన గురించి ప్రచారం చేసుకుంటున్న ఈ సందర్భంలో మోడీ నాలుగేళ్ళ పాలనను అంచనా వేయవలసిన అవసరం మరింత ఎక్కువగా ఉన్నది. ఈ మధ్యనే సమాచార హక్కుతో తెలుసుకున్న వివరాల ప్రకారం, వివిధ మాధ్యమాల ద్వారా మోడీ తన ప్రభుత్వాన్ని ప్రచారం చేసుకోవడానికి రూ. 4343.26 కోట్లు ఖర్చు చేసారు. భర్తలు చనిపోయిన స్త్రీలకు చెల్లించే పెన్షన్ ఒక రూపాయి కూడా పెంచడానికి తన దగ్గర సొమ్ములేదంటూ ప్రభుత్వం నిరాకరిస్తున్న పరిస్థితులలో ఇంత పెద్ద మొత్తం ప్రచారానికి ఖర్చుచేయడం వెగటు కలిగిస్తుంది.

"పేదల పక్షపాతి"గా ఎన్నో విజయాలను సాధించినట్టు, అట్టహాసంగా జరుపుకుంటున్న మోడీ నాలుగేళ్ళ పాలనాసంబరాలను కర్ణాటక యెన్నికల ఫలితాలు కొంత నీరుగార్చాయి.

## వాస్తవం ఏమిటి ?

నాలుగేళ్ళ పాలన గురించి అంచనా వేస్తూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మొదటి పుస్తకంలో, **ధనికులను మరింత ధనికులగా పెంచే ఒక నమూనాగా మోడీ నమూనా ఎందుకుందో తెలియచేసే ఆర్థిక, విధానపరమైన మౌలిక అంశాల గురించి వివరించారు.** రెండు కోట్ల ఉద్యోగాల మాటేమిటి? అత్యవసర సరుకుల ధరలు అదుపు చేస్తానన్న వాగ్దానాల సంగతేమిటి? జన్దాన్ యోజన, ఉజ్జ్వల యోజన అనే మోడీ మార్క్ పథకాల అసలు రంగేమిటి? ఈ విషయాలన్నీ

ఈ పుస్తకంలో ఉన్నాయి.

కనీవినీ ఎరగని రీతిలో ఈ కాలంలో పెరిగిన అసమానతలు మోడీ పాలనఅసలు స్వరూపానికి అద్ధం పడుతున్నాయి. నిజానికి మోడీగారు తన మనసులోమాట (మన్‌కి బాత్) లో ఏనాడూ డబ్బు ప్రస్తావన (ధన్‌కి బాత్) తేలేదు. 2015 లో సామాజిక ఆర్థికసర్వే ఫలితాలను ప్రకటించినప్పుడు 75 శాతం గ్రామీణ కుటుంబాల నెలసరి ఆదాయం రూ. 5000/- కన్నా తక్కువగా ఉందని తేలింది. ఒక ఇంట్లో గనక ఐదుగురు సభ్యులు ఉన్నారని లెక్క వేసుకుంటే మనిషికి రోజుకి రూ. 33/- ఖర్చువుతున్నట్టు లెక్క తేలుతోంది. మరో వైపు క్రెడిట్ సుశి అంచనాల ప్రకారం మోదీగారి పాలనలో భారతదేశంలోని అత్యంత ధనికులుగా ఉన్న ఒక్క శాతం వద్ద పోగుపడిన సంపద పది శాతం పెరిగి 58 శాతానికి చేరుకుంది. అత్యంత ధనికులపై అతి తక్కువ పన్నులు వేయడం, వారి బ్యాంకు అప్పులను రద్దు చేయడం, కార్పొరేట్లకు రకరకాల రాయితీలివ్వడం, సబ్సిడీలివ్వడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలమని తెలియచేస్తున్నది. ఎన్నికలకు ముందు మోడీ రహస్యంగా కార్పొరేట్లకు చేసిన ఈ వాగ్దానాలన్నీ అమలు చేసారు.

ఈ కాలంలో పాలకుల పంచన చేరిన వారి లాభాలు విపరీతంగా పెరిగి ఆశ్రిత పెట్టుబడి బాగా పెరగడాన్ని కూడా చూడగలం. అదానీ వ్యాపారమే ఒక మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2017 డిసెంబర్ నాటికి వారి సగటు నికర ఆస్తులు 124.6 % పెరిగాయి. క్రిందటి సంవత్సరం అత్యధిక లాభాలను ఆర్జించిన వారిలో ఆయన అందరికంటే పైన ఉన్నాడు. 2015-16, 2016-17 మధ్య కాలంలో బిజెపి ఆదాయం 81.18 %, రూ. 570 కోట్ల నుండి రూ. 1034.27 కోట్లకు పెరగడం యాదృశ్చికం కాదు.

కార్పొరేట్లు సులభంగా లాభాలను సంపాదించుకునేందుకు వీలుగా ప్రభుత్వం చేత రకరకాల విధానాలు రూపొందించడం, తత్ఫలితంగా పాలిత పార్టీకి విరాళాలు కుప్పలు తెప్పలుగా రావడం వెనక ఉన్న ఆంతర్యం లోతుగా పరిశీలించవలసిన అవసరం ఉంది. చెడు సంప్రదాయాల నుండి భారత దేశాన్ని విముక్తి చేస్తానన్న మోడీ వాగ్దానం వాస్తవంలో ఆ చెడు సంప్రదాయాలలో ఎలా తలామునకలుగా కూరుకుని పోయిందో ఈ పుస్తకంలోని ఒక భాగం తెలియచేస్తుంది.

రెండో పుస్తకం **ఆర్‌ఎస్‌ఎస్ కు చేసిన వాగ్దానాలు, అవి బాహాటంగా ప్రజలకు తెలియజేయక పోయినా, ఎలా అమలు చేసిందో తెలియచేస్తున్నది.** కిందటి సాధారణ ఎన్నికలలో మోడీ నాయకత్వానికి తన స్వంత పార్టీలో విబేధాలు ఏర్పడ్డప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ఆయనకు పూర్తిగా అండగా నిలబడింది. భారతదేశ ప్రధాని తన జీవితంలో

అత్యధిక భాగం ఆర్ఎస్ఎస్ ప్రచారకుడుగా ఉన్న విషయం బహిరంగమే.. రాజ్యాంగాన్ని రక్షిస్తానని ప్రమాణం చేయడానికి ముందే ఆయన ఆర్ఎస్ఎస్ లో తీసుకున్న ప్రమాణానికి, భక్తి గీతానికి కట్టుబడి ఉన్నారు. రెండో పుస్తకంలో మోడీ ప్రభుత్వం హిందూ రాష్ట్రం స్థాపించడానికి బహిరంగంగాను ఆంతరంగికంగాను తీసుకున్న చర్యలను గురించి చర్చించడం జరిగింది. ఈ పుస్తకం రాజ్యాంగంలో మౌలిక అంశాలైన లౌకిక స్వరూపం పైనా, మైనారిటీలపైనా, ప్రజాతంత్ర, స్వయంప్రతిపత్తి గలసంస్థలపైనా, సమాఖ్యపైనా ఎలా దాడులు జరిగాయో వివరించడం జరిగింది.

ప్రస్తుతం రాజ్యాంగంలో సమాఖ్యపై జరుగుతున్న దాడి, రాష్ట్రాల హక్కులను దిగజార్చడం, భారతదేశాన్ని ఒకే కేంద్రం కిందకి తేవాలన్న ఆర్ఎస్ఎస్ ఎజెండాలో భాగంగా గుర్తించబడడం లేదు. హిందీని దేశమంతా రుద్దాలనుకోవడం తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంది. కానీ ఆ ప్రయత్నాలు ఆగలేదు. ఇదివరకటి కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రాలపై పెత్తనం చేయలేదనికాదు. మోడీ ప్రభుత్వం అన్ని పూర్వపు రికార్డులను తిరగ రాసింది. 15వ ఆర్థిక సంఘానికి చేసిన సిఫారసులను చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఈ పుస్తకంలో కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇసాక్ 15 వ ఆర్థిక సంఘ సిఫారసులకు సంబంధించిన అన్ని అంశాలను గురించి వ్రాసిన ఒక వ్యాసం ఉంది. ఈ పుస్తకంలో కాశ్మీర్లోని పరిస్థితులకి సంబంధించిన వ్యాసం కూడా ఉంది. కాశ్మీర్ విషయంలో కేంద్ర ప్రభుత్వ విధానాల పూర్తి వైఫల్యం, అందుకు పర్యవసానంగా అక్కడి ప్రజలు పూర్తిగా వేరుపడిపోయిన వైనం తేట తెల్లంగా చెప్పబడింది.

నిజానికి పాలకులు దేశంలోని ఇతర ప్రాంతాలలో తప్పుడు జాతీయవాదం లేవనెత్తేందుకు కాశ్మీర్ని ఉపయోగించుకుంటున్నారు. భారత ప్రభుత్వం తన విదేశాంగ విధానంతో దేశాన్ని "ప్రపంచ శక్తిగా గుర్తించేటట్టు, గౌరవించేటట్టు" చేస్తామన్న వాదనను ఇందులో విశ్లేషించడం జరిగింది. భారత దేశ విదేశాంగ విధానాన్ని మోడీ వ్యక్తిగత సంబంధంగా దిగజార్చి విదేశాంగ విధానం రూపొందించడంలో ఏంతో అనుభవమున్నవారి అనుభవాలను కించపరచినందువలన విదేశాంగ విధానం ఆటుపోట్లకు గురై చిరకాల మిత్రులను స్నేహితులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. మోడీ ప్రభుత్వం అంతకు ముందటి యుపిఎ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లాగానే దేశాన్ని అమెరికా జూనియర్ భాగస్వామిని చేసి ఘోరమైన విధానాలను తీవ్రంగా అమలుచేయడం ప్రారంభించింది. భారతదేశాన్ని అమెరికా వ్యూహాత్మక భాగస్వామిని చేసింది.

బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలోగాని, ఆ తరువాత గాని ప్రజలలోని అనేక

తరగతులకు, రైతులకు, కార్మికులకు, మహిళలకు, ముఖ్యంగా దళితులకు ఆదివాసీలకు వివిధ రకాల వాగ్దానాలను చేసింది. ఈ మేనిఫెస్టో అందరికి విద్య, వైద్యం అందిస్తామని కూడా వాగ్దానం చేసింది. ఈ వాగ్దనాలు బిజెపి పరిపాలనకు మంచి రోజులు తెచ్చిపెట్టి ఉండేవి.

మూడు నాలుగు పుస్తకాలలో **ఈ వాగ్దానాలు వాటి అమలు గురించి ప్రస్తావించడం జరిగింది.** ఈ ప్రభుత్వ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. మోడీ ప్రభుత్వం ఉద్యోగులకు కొత్తగా ప్రవేశ పెట్టిన పరిమితకాల నియామకాలు కార్మికులను అవసరానికి తీసుకుని అవసరం తీరగానే తీసివేసే విధానాన్ని ప్రవేశ పెడుతుంది. ఈ పద్ధతిని యజమానులు ఎప్పటినుండో కోరుకుంటున్నారు. పార్లమెంటులో అతి పెద్ద ఏకైక పార్టీగా ఉండి కూడా మహిళా రిజర్వేషన్ బిల్‌ను తొక్కిపెట్టి మహిళలకు తీరని అన్యాయం చేసింది. ఈ ప్రభుత్వ హయాంలో దళితులూ ముందెన్నడూ లేనంతగా జీవనోపాధిని కోల్పోయారు. వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే తీవ్రమయిన దాడులను, ఎదుర్కొన్నారు. అటవీ అధికారాల చట్టంనీరుగార్చబడింది. తరతరాలుగా అడవినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలు ఉన్న వారి స్థానాలనుండి తొలగించ బడుతున్నారు. ఆధార్ ప్రభుత్వానికి ఒక వరంగా మారింది. ఇది ప్రభుత్వం పేద ప్రజలకు అందవలసిన హక్కులు అందకుండా చేయడానికి ఒక ఆయుధంగా తయారయింది. ఈ రెండు పుస్తకాలూ బిజెపి పేదలకు అనుకూలమన్న వాదనను ఆధారాలతో సహా తప్పని రుజువు చేస్తాయి.

మోడీ ప్రభుత్వ విధానాల వైఫల్యాలు ఈ ప్రభుత్వ పాలన అంతం కానున్నదని సూచిస్తున్నాయి.

వామపక్షాలు అనుసరించబోయే ప్రత్యామ్నాయ విధానాలు చెప్పడం ఈ పుస్తకాల పరిధిలో లేదు. ఆ విధానాలకు సంబంధించిన సమాచారం కేరళ, బెంగాల్ త్రిపురలలోని వామపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాలలో విరివిగా అందుబాటులో ఉండనే ఉన్నది. ఆసక్తి ఉన్నవారు వాటిని అధ్యయనం చేయవచ్చు. ఇప్పుడు కేరళ లో పినరయి విజయన్ నాయకత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం రెండో వార్షికోత్సవం జరుపుకుంటున్నది. ఈ ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాలను చాలా వరకు అమలు జరిపి ప్రజాకేంద్రంగా అభివృద్ధి జరగడానికి ఒక నమూనాగా నిలిపింది. వివిధ కారణాల వలన ఎన్నికలలో ఓడిపోయినప్పటికీ మాణిక్ సర్కార్ త్రిపురని ఎన్నో సామాజిక సూచికలలో అగ్రభాగాన నిలిపారు. అంతకు ముందు పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం భూ సంస్కరణలు అమలుచేసి, పంచాయత్ వ్యవస్థను పటిష్ట పరచి చరిత్ర సృష్టించింది. ఈ ప్రభుత్వాలు వివిధ తరగతుల ప్రజల మధ్య

సామరస్యాన్ని పెంచి పురోగమనాన్నీ సాధించాయి. అందువలననే బిజెపి – ఆర్ఎస్ఎస్ వామపక్షాలను తమ సైద్ధాంతిక శత్రువులుగా పరిగణిస్తాయి. వారి విష ప్రచారానికి విభజించి పాలించే తత్వానికి అడ్డంకిగా భావిస్తాయి.

ఈ నాడు ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్ని, ప్రజల హక్కులను కాపాడడానికి అవసరమయిన ప్రత్యామ్నాయ విధానాలకు, ప్రత్యామ్నాయ రాజకీయాలకు వామపక్షాలు ఛాంపియన్స్‌గా ఉన్నాయి. పైన చెప్పిన కారణాల రీత్యా బిజెపి – ఆర్ఎస్ఎస్‌ల విధానాలను సవాలు చేస్తూనే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల మధ్య ఐక్యతను సమీకరణ బలాన్ని పెంచుకుని భారతదేశానికి భారత ప్రజలకు అవసరమయిన ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఉంది. ఈ పుస్తకాలను రూపొందించడానికి అనేకమంది కామ్రేడ్స్ ఎంతో శ్రమించారు. సవేరా, శ్యాం, ప్రాంజల్, సోనాలి, ప్రబీర్ పూరకాయత్స్య, రాజేంద్ర శర్మ, బాదల్ సరోజ్, సుభాషిణి అలీ, విజూ కృష్ణన్, రఘు, వెంకటేష్ ఆత్రేయ, జుబిన్ డెన్నిస్, అజయ్ కుమార్‌లకు ధన్యవాదాలు.

ఈ పుస్తకానికి కార్టూన్లు గీసిచ్చిన

కార్టూనిస్టులకు కూడా ధన్యవాదాలు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడానికి, రానున్న రోజులలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోడానికి ఈ పుస్తకం ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నాను.

**బృందా కరత్**
**మే 2018**

# విద్య : ప్రయివేటు దురాశ, కాషాయ ఎజెండా

**మో**డీ నాయకత్వంలోని నాలుగేళ్ల కేంద్రప్రభుత్వ పాలనలో  విద్యారంగం నిరంతర దాడులను చవిచూస్తున్నది. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులు విపరీతమైన బాధలు అనుభవిస్తున్నారు. పాలకులు విద్యారంగానికి నిధులు కోత పెడుతున్నారు, విద్యా ప్రాంగణాలలో ప్రజాస్వామ్యాన్ని హరిస్తున్నారు, విద్యారంగంలో మరింత ప్రైవేటు రంగాన్ని, అనుమతించడం, మరింత కేంద్రీకరించడం జరుగుతున్నది, విద్యకు కాషాయ రంగు పులమడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## నిధుల కోత

భారత దేశంలో విద్యారంగానికి నిధుల కేటాయింపులు చారిత్రకంగానే నామమాత్రంగా ఉన్నాయి. విద్యారంగానికి నిధులను జిడిపి లో 6 శాతానికి పెంచాలని కొఠారీ కమిషన్ (1964–66) సిఫార్సు చేసింది. అప్పటి నుండి ఇది విద్యార్థి ఉద్యమ కీలక డిమాండుగా వస్తున్నది. కాని ఇప్పుడు కొఠారీ సిఫార్సు చేసిన 52 సంవత్సరాల తర్వాత కూడా విద్యారంగానికి కేంద్రం, రాష్ట్రాలు కలిపి కేటాయిస్తున్న నిధులు (2017–18 బడ్జెట్ అంచనాలు, 2017–18 ఎకనామిక్ సర్వే ప్రకారం) కేవలం జిడిపి లో 2.7 శాతం మాత్రమే.

బిజెపి ప్రభుత్వం వేగంగా పెరుగుతున్న జనాభాకు భరించకలిగిన విధంగా విద్యాసౌకర్యం కలిగించడానికి బదులు, విద్యారంగానికి నిధులు కోత పెడుతున్నది. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగానికి నిధుల కేటాయింపు పెరుగుదల రేటు ద్రవ్యోల్బణం పెరుగుదల రేటు కన్నా తక్కువగా ఉంటున్నది.

## విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వ నిధుల కేటాయింపు

| సంవత్సరం | కేంద్ర బడ్జెట్‌లో శాతం | జిడిపిలో శాతం |
|---|---|---|
| 2013-14 | 4.77 | 0.71 |
| 2014-15 | 4.61 | 0.67 |
| 2015-16 | 3.89 | 0.50 |
| 2016-17 | 3.66 | 0.48 |
| 2017-18 | 3.71 | 0.47 |
| 2018-19 | 3.48 | 0.45 |

**ఆధారం: బడ్జెట్ పత్రాలు**

## మూసివేతలు, ప్రైవేటీకరణ ప్రమాదంలో బడులు

బిజెపి ప్రభుత్వం నిర్లాక్షిణ్యంగా విధిస్తున్న నిధుల కోత, ప్రైవేటీకరణ ప్రయత్నాల వల్ల పాఠశాల విద్య సైతం ప్రమాదంలో పడింది. రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం 2018 విద్యాసంవత్సరం నుండి 300 ప్రభుత్వ సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం కిందకు తీసుకొచ్చేందుకు నడుం బిగించింది. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు రంగానికి అప్పచెబితే విద్య మరింత ఖరీదవుతుంది. టీచర్లు, మధ్యాహ్న భోజన వర్కర్లతో సహా 15,000 మంది ఉద్యోగాలు కోల్పోతారని టీచర్ల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

2.6 లక్షల చిన్న ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడానికి కేంద్ర మానవ వనరులు శాఖ ప్రతిపాదనలను గత ఏడాది సర్క్యులేట్ చేసింది. ఓ కార్పొరేట్ సంస్థలా వ్యవహరిస్తూ ప్రభుత్వం 30 మంది కన్నా తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను నిర్వహించడం గిట్టుబాటు కాదని చెబుతున్నది. అయితే ఈ స్కూళ్లు గిరిజన, ఇతర బలహీన వర్గాల విద్యార్థులకు సేవలందిస్తూ మారుమూల ప్రాంతాల్లో ఉన్నాయి. వాటిని మూసివేయడమంటే విద్యను ఆ సెక్షన్లను దూరం చేయడమే.

మహారాష్ట్ర లోని బిజెపి ప్రభుత్వం 10 మంది కన్నా తక్కువ విద్యార్థులున్న 4093 పాఠశాలలను మూసివేయాలని 2017లో నిర్ణయం తీసుకుంది. ఇదే ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలు స్కూళ్లు ప్రారంభించడాన్ని అనుమతించే బిల్లును పాస్ చేసింది. రాజస్తాన్‌లో 20000 లకు పైగా స్కూళ్లు మూసివేతకు గురయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలను అసంఖ్యాకంగా మూసివేయడానికి ప్రయత్నిస్తున్నట్లు మధ్య ప్రదేశ్,

ఒరిస్సా, హిమాచల్ ప్రదేశ్, హర్యానా లాంటి రాష్ట్రాల నుండి వార్తలొస్తున్నాయి.

తగినంత నిధులు కేటాయించకపోవడం వల్ల మధ్యాహ్న భోజన పథకం లాంటి పథకాలు దెబ్బతింటున్నాయి. టీచర్ల సంఖ్యను పెంచి ప్రభుత్వ స్కూళ్ల నాణ్యతను పెంచడానికి కృషి చేయడంలేదు. దానికి బదులుగా బిజెపి ప్రభుత్వం వాటిని మరింత దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నది. దాని అంతిమ లక్ష్యం స్కూలు విద్యలో ప్రైవేటు లాభార్జనకు దారులు తెరవడం.

దీని మూలంగా తల్లిదండ్రులు తమ పిల్లలను గత్యంతరం లేక ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్నారు. ప్రయివేటు స్కూళ్లపై నియంత్రణ లేకపోవడం వల్ల యాజమాన్యాలు తల్లిదండ్రుల నుండి భారీ ఫీజులు పిండుకుంటున్నాయి. లెఫ్ట్ అండ్ డెమోక్రాటిక్ ఫ్రంటు ఆధ్యర్యంలో నడుస్తున్న ఒక్క కేరళ మాత్రం దీనికి పూర్తి భిన్నమైన దిశలో పయనిస్తున్నది. ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు బాగా పెరగడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్ళ నుండి ప్రభుత్వ స్కూళ్లకు మారుస్తున్నారు.

గత కొన్నేళ్లుగా విపరీతమైన స్కూలు ఫీజులు, ఇతర ఛార్జీలకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా అనేక ఆందోళనలు జరుగుతున్నాయి. మోడీ ప్రభుత్వం మాత్రం వీటినేమీ పట్టించుకోకుండా తన దారిలో తాను వెళుతున్నది. ప్రజలను వారి ఖర్మానికి వదిలేసి ప్రైవేటీకరణ కోసం అర్రులు చాస్తున్నది.

## ప్రభుత్వ విద్య అందుబాటు తగ్గింపు

విద్యారంగానికి నిధుల కోత మెజారిటీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే శక్తిని తగ్గించేస్తున్నది. దీనితో పాటు ప్రభుత్వం ఉన్నత విద్యలోను, రీసెర్చిలోను ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశించే విద్యార్థులను తగ్గించేందుకు కూడా ప్రయత్నిస్తున్నది.

యుజిసి మే 2016 నోటిఫికేషన్‌ప్రకారం 2017-18లో జెఎన్‌యులో వెయ్యికి పైగా ఎంఫిల్, పిహెచ్‌డి సీట్లను తగ్గించారు. 2018-19లో కూడ 400 సీట్లను తగ్గిస్తున్నారు. దేశవ్యాపితంగా అనేక కాలేజీలు, యూనివర్సిటీలలో పెద్ద సంఖ్యలో ఫ్యాకల్టీ స్థానాలు ఖాళీగా ఉన్న పరిస్థితిలో ఇది జరుగుతున్నది. ఇదే సమయంలో ఎఐసిటిఇ ఫాకల్టీ, విద్యార్థి నిష్పత్తిని 1:15 నుండి 1:20 కి పెంచడానికి నిర్ణయించింది. ఈ చర్య టెక్నికల్ విద్య నాణ్యతను దిగజారుస్తుంది.

సిఎస్ఐఆర్ ల్యాబ్‌లు, యూనివర్సిటీలకు నిధులను తగ్గించి వేశారు. రీసెర్చి ఫెలోషిప్‌లకు కోత పెట్టారు. కేంద్రం నుండి నిధుల కేటాయింపు లేకపోవడంతో పరిశోధనా విద్యార్థులకు నాన్ జెఆర్ఎఫ్ యుజిసి ఫెలోషిప్పులు క్రమపద్ధతిలో అందడం లేదు.

## మినహాయింపు అనేది బిజెపి మార్గదర్శక సూత్రం

ఈ విధానాల భారం పేద వర్గాలు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల మీద అత్యధికంగా పడుతుంది. విద్యార్థులు విద్యను ముగించుకోవడానికి సహాయపడే అనేక నిబంధనలు దాడికి గురవుతున్నాయి. పలు రాష్ట్రాలలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లు మూత పడుతున్నాయి లేదా ప్రైవేటీకరించబడుతున్నాయి. నిధుల కొరతను ఎదుర్కొంటున్న ఈ హాస్టళ్లలో పరిస్థితి అమానుషంగా ఉంది. బలహీన వర్గాల విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, ఫెలోషిప్పులు నిరంతర దాడికి గురవుతున్నాయి. ఇటీవలి ఒక నివేదిక ప్రకారం గత మూడేళ్ల కాలంలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల స్కాలర్‌షిప్పుల బకాయిలు రూ.11,160 కోట్లకు (ఎస్‌సిల కు రూ.8000 కోట్లు, ఎస్‌టిలు రూ.3156 కోట్లు) పేరుకు పోయాయి. ఈ బకాయిలు సకాలంలో చెల్లించకపోతే, 71,36,960 మంది విద్యార్థుల– ఎస్‌సిలు 5,103,243 మంది, ఎస్‌టిలు 20,33,741 భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంది. సామాజిక మినహాయింపు, సమ్మిళిత అధ్యయనం చేసే కేంద్రాలు, 35 కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఉన్నాయి. సామాజికంగా పక్కకు నెట్టబడిన వర్గాలను ప్రధాన స్రవంతిలో చేర్చడం ఈ కేంద్రాల లక్ష్యం. కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాకపోవడం వల్ల ఈ కేంద్రాలు మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫాకల్టీ రిక్రూట్‌మెంట్‌లో యూనిట్‌కు 200 పాయింట్ల రిజర్వేషన్ పద్ధతి నుండి మార్చడానికి, మొత్తం ఒక డిపార్ట్‌మెంటును యూనిట్‌గా పరిగణించమని యుజిసి మార్గదర్శకాలను జారీ చేసింది. రిజర్వు కేటగిరీ నుండి ఫ్యాకల్టీగా నియామకానికి ఎదురు చూస్తున్న వారి అవకాశాలను ఇది తీవ్రంగా దెబ్బతీస్తుంది.

## ప్రైవేటీకరించడానికి తహతహ

విద్యారంగాన్ని ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతున్నది. ప్రభుత్వ విద్యా సంస్థలకు గ్రాంట్ల స్థానంలో, రుణాలను ప్రవేశపెట్టడం ఒక ఉదాహరణ. ఉన్నత విద్యా ఫండింగ్ సంస్థ (హెచ్‌ఇఎఫ్‌ఏ) ద్వారా ఈ రుణాల అందించబడతాయి. విద్యాసంస్థలు ఫీజుల వసూలు, పరిశోధనల వలన వచ్చిన ఆదాయాలు మొదలైన వాటి ద్వారా డబ్బు సంపాదించి ఈ రుణాలను తిరిగి చెల్లించాలి. దీనర్థం ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫీజులను పెంచడమే. ఫలితంగా ప్రభుత్వ విద్య ఒక సరుకుగా మారిపోతుంది. ప్రభుత్వ విద్యా సంస్థల స్వభావం మారిపోతుంది. ఈ విద్యా సరుకును కొనడానికి పేద బలహీన వర్గాల విద్యార్థులు నానా ఇక్కట్లు పడాల్సి వస్తుంది. హెచ్‌ఇఎఫ్‌ఏ ఇప్పటికే ముంబాయి, ఢిల్లీ, ఖరగ్‌పూర్, కాన్పూర్ ఐఐటిలకు, సూరత్‌కల్ నిట్‌కు ప్రాజెక్టులను ఆమోదించింది. విద్యను వాణిజ్యీకరించడానికి కాంగ్రెస్

నాయకత్వంలోని యుపిఏ 2 ప్రవేశపెట్టిన రాష్ట్రీయ ఉచ్చతమ్ శిక్షా అభియాన్ (ఆర్‌యుఎస్‌ఏ) ను బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. పాఠాలు చెప్పే, నేర్చుకునే గంటలను తీవ్రంగా తగ్గించడం వల్ల విద్యార్థులు పరీక్షలు, ఎసైన్‌మెంట్లతో మితిమీరిన భారానికి గురవుతున్నారు. సెమిస్టర్ ఫలితాలను విడుదల చేయడంలో జాప్యం, అవకతవకల గురించి అనేక నివేదికలున్నాయి. సమాధాన పత్రాల మూల్యాంకన పనిని ప్రైవేటు కంపెనీలకు ఔట్‌సోర్సింగ్‌గా ఇచ్చిన ఉదంతాలు కూడా ఉన్నాయి.

విద్యను కేంద్రీకృతం చేసే ప్రయత్నాలు బిజెపి హయాంలో నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. యుజిసి, ఎఐసిటిఇ సంస్థలను ఉన్నత విద్యా సాధికార నియంత్రణ సంస్థ (హెచ్ఇఇఆర్ఏ)కు మార్చాలని యుజిసి ప్రతిపాదించింది.

## మతోన్మాదం

విద్యను మతతత్వపూరితం చేయడం బిజెపి, ఆరెస్సెస్‌ల ప్రధాన ఎజెండా. జెఎన్‌యు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చి లాంటి సంస్థలను ఆరెస్సెస్‌తో బలమైన సంబంధాలున్న వ్యక్తులతో నింపేశారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో పాఠ్యపుస్తకాలను మతతత్వపూరితం చేసే కార్యక్రమం ఎప్పటినుండో కొనసాగుతున్నది. బిజెపి ప్రభుత్వం ఆరెస్సెస్ భావజాలానికి అనుగుణంగా చరిత్రను తిరగరాయడానికి 2016లో ఒక కమిటీని నియమించింది. మతతత్వ విషాన్ని సమాజంలోకి మరింత జొప్పించడానికి సంఘపరివార్ ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నదో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ.

## నియంతృత్వ దాడులు

పూనె ఎఫ్‌టిఐఐ, ఐఐటి మద్రాసు, హైదరాబాదు కేంద్ర యూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ, ఆలీఘర్ ముస్లిమ్ యూనివర్సిటీ లాంటి విద్యార్థులపై నియంతృత్వ దాడులు  చేయడం వీటితో పాటు కొనసాతున్నది. ఈ దాడులన్నీ ఆరెస్సెస్, బిజెపి ఎజెండాను ప్రతిఘటించే విద్యార్థులను అణచివేయడానికి, విద్యను వాణిజ్యీకరించడం, మతతత్వ పూరితం అనే తమ ఎజెండాను రుద్దడానికి ఉద్దేశించబడినాయి. యుజిసి, ఎంహెచ్‌ఆర్‌డిలు నోటిఫికేషన్ల ద్వారా ఈ వినాశకర మార్పులను ప్రవేశపెడుతున్న సమయంలో ప్రజాతంత్ర సంస్థల అభిప్రాయాలను లెక్కచేయడంలేదు. టీచర్ల, విద్యార్థుల అభిప్రాయాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

***

# ఆరోగ్యం : కుబేరులవుతున్న కార్పొరేట్లు, అనారోగ్యంలో జనం

ఆరోగ్యం కాపాడుకునేందుకు అవసరమయిన ఖర్చులను భరించగలిగిన స్థాయిలోనే ఉంచి సమర్థవంతమైన ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేస్తామని 2014 ఎన్నికల సమయంలో బిజెపి వాగ్దానం చేసింది. ఈ నాలుగేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ అనే స్కీమును ప్రకటించింది. ఇది 50 కోట్ల మందికి భీమా సౌకర్యం కల్పించడం కోసం ఉద్దేశించబడింది. **స్వాస్థ్య భారత్** (ఆరోగ్యవంతమైన ఇండియా) అంటే **సమృద్ధ భారత్** (సౌభాగ్యవంతమైన ఇండియా) అని వారు ప్రకటించారు.

కాని వారి అందమయిన ఊహలకు వాస్తవానికి పొంతనలేదు. అన్ని వాగ్దానాలలాగే మోడీ చేసిన ఈ వాగ్దానం కూడ కార్పొరేట్ రంగ లాభార్జనకు దారులు తెరిచింది, ప్రభుత్వ వ్యవస్థకు నిధులు కేటాయించకుండా మాడుస్తున్నది. కాని విస్తారమైన ప్రజానీకం అంటు వ్యాధులు, దీర్ఘ వ్యాధులతో భాధపడుతున్న దేశంలో, మెజారిటీ ప్రజలు చికిత్స భారాన్ని తట్టుకోలేని స్థితిలో ఉన్న దేశంలో, ఆరోగ్య రక్షణ వ్యవస్థను లాభార్జనకు అనువయిన ప్రదేశంగా మార్చడం అనేది ఎంతో దౌర్భాగ్యమయినది..

బిజెపి కేంద్ర ప్రభుత్వము, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల ఆరోగ్య పరిరక్షణను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలను నిధుల ఇవ్వక మాడుస్తున్నాయి.

## ఆరోగ్య పరిరక్షణ వ్యయం

ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులను భారీగా పెంచానని

చెప్పుకుంటున్నప్పటికీ ఇది మొత్తం జిడిపిలో 1.4 శాతం మాత్రమే. దీనిలో కేంద్రం వాటా కేవలం 0.3 శాతమే. మిగతాదంతా రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తున్నాయి. గత పూర్తి స్థాయి బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం కేటాయింపులను నామమాత్రంగా 2.5 శాతం పెంచింది. కేటాయింపువల్ల అనేక కీలక ఆరోగ్య పథకాలు నిధుల కోతకు గురయ్యాయి.

- గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఆరోగ్య సేవలందించే **జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం)** కు కేటాయింపు రూ.30,801 కోట్ల నుండి 2017-18 సవరించిన అంచనాల ప్రకారం రూ.30,129 కోట్లకు తగ్గింది.
- **తల్లి బిడ్డల ఆరోగ్య పథకానికి** ఈ సంవత్సరంలో నిధుల కేటాయింపు 30 శాతం తగ్గింది. రూ.7,545 కోట్ల నుండి 2017-18 సవరించిన అంచనాల ప్రకారం రూ.5,253 కోట్లకు తగ్గింది.
- **అంటు వ్యాధుల నివారణకు** నిధులు 27 శాతం తగ్గాయి. ఈ కేటాయింపు రూ. 2,648 కోట్ల నుండి 2017-18 సవరించిన అంచనాల ప్రకారం రు.1,928 కోట్లకు తగ్గింది.
- ప్రధాన మంత్రి **మాతృత్వ వందన యోజన** పేరు పెట్టిన గర్భిణీ స్త్రీలకు లబ్ది చేసే పథకానికి నిధుల కేటాయింపు 7.5 శాతం కోతకు గురయింది. ఇది రూ.2595 కోట్ల నుండి 2017-18 సవరించిన అంచనాల ప్రకారం రూ.2,400 కోట్లకు తగ్గింది.
- జిల్లా ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా 24 **కొత్త మెడికల్ కాలేజీలను** ఏర్పాటు చేస్తానని ప్రభుత్వం చెప్పింది. కాని జిల్లా ఆసుపత్రులకు కేటాయింపులు 12 శాతం తగ్గాయి. రూ.3300 కోట్ల నుండి 2017-18 సవరించిన అంచనాల ప్రకారం రూ.2,888 కోట్లకు తగ్గాయి.

బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే దారిలో నడిచాయి. మెదడు వాపు వ్యాధితో ఎంతో మంది బాధపడుతున్న యుపి రాష్ట్రంలో యోగి ఆదిత్య నాథ్ ప్రభుత్వం 2017-18లో మెదడు వాపు వ్యాధికి కేటాయింపులను రూ.10.19 కోట్ల నుండి రు.5.78 కోట్లకు తగ్గించింది. ఒకే ఐసియు బెడ్ మీద ముగ్గురు, నలుగురు పసిబిడ్డలను పడుకోబెట్టి వైద్యం చేసిన చోట, అక్కడ ఆక్సిజన్ సరఫరా చేసిన వారికి బిల్లులు చెల్లించక పోతే, ఆక్సిజన్ సిలిండర్లను అందించక పోవడంతో గత 2017 ఆగస్టు చివరి వారంలో 72 మంది చిన్నారులు ప్రాణాలు గాలిలో కలిసిపోవడం చూస్తే ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు.

## ఆయుష్మాన్ భారత్

ఈ నూతన ఆరోగ్య పరిరక్షణ పథకం ప్రకారం 50 కోట్ల పేద ప్రజలకు రూ.5లక్షలవరకు ఆరోగ్య లభిస్తుందని ప్రధాని మోడీ ప్రకటించారు. మోడీ గారి భద్రత ఇతర పథకాల లాగానే ఇది కూడ వివరాలు పరిశీలించే వరకు ఘనంగా కనిపిస్తుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ పథకానికి కేవలం రూ.2000 కోట్లు మాత్రమే కేటాయించబడినాయి. అంటే ఏడాదికి ఒక్కొక్కరికి రు.40లు చొప్పున. ఆ తరువాత దీనిని రూ.11,000 కోట్లుకు పెంచుతామని అధికారులు చెప్పారు. అయినప్పటికీ ఇది అవసరమైన కనీస మొత్తంలో సగానికన్నా తక్కువ.

అన్నిటికన్నా ముఖ్యంగా ఈ పథకం వర్తించేది ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా చేరిన వారికి మాత్రమే. కాని ప్రజలు ఆరోగ్య పరిరక్షణ కోసం ఖర్చు పెట్టే దానిలో మూడింట రెండువంతులు ఆసుపత్రుల్లో కాదు, ప్రధానంగా మందుల లాంటి వాటికి. అంటే ఈ పథకం తీవ్రంగా జబ్బుపడితే తప్ప వినియోగపడదు. ఈ పథకం వల్ల లాభపడేది అత్యధికంగా ప్రైవేటు ఆసుపత్రులు, ఇన్సూరెన్స్ కంపెనీలు మాత్రమే. ఇన్సూరెన్స్ ఉందంటే ఆ పేషెంట్లకు అవసరానికి మించిన చికిత్సలు చేస్తారు, అధిక చార్జీలు విధిస్తారు. ప్రీమియం మొత్తాలను ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం మాదిరిగానే ఇన్సూరెన్స్ కంపెనీలకే బదిలీ చేస్తున్నది. ఇంతకు ముందు రాష్ట్రీయ స్వాస్త్య బీమా యోజన (ఆర్ఎస్‌బివై) అనుభవం కూడ ఇదే. ప్రజలు ఆరోగ్యంపై స్వంతంగా పెట్టే ఖర్చు పెరిగింది తప్ప తగ్గలేదు.

## ప్రైవేటు ఆసుపత్రుల లాభార్జన

ఇటీవల కాలంలో ప్రైవేటు ఆసుపత్రుల నెట్‌వర్క్ విపరీతంగా పెరిగి పోతున్నది. దీనావస్థలో ఉన్న పేషెంట్ల నుండి, వారి కుటుంబాల నుండి అంతులేని డబ్బు గుంజి లాభాల పోగుపోసుకుంటున్నాయి. ఈ ఆసుపత్రుల నెట్ వర్క్ ఒక మహమ్మారిగా మారింది. గుర్‌గావ్‌లోని ఫోర్టిస్ ఆసుపత్రిలో జరిగిన ఒక సంఘటన దీనికి ఉదాహరణ. ఈ ఆసుపత్రిలో ఏడేళ్ల బాలునికి 15 రోజులపాటు చికిత్స చేసిన తర్వాత ఆ బాలుడు మరణించాడు, మరణించిన తర్వాత వారు ఛార్జ్ చేసిన బిల్లు రూ.16లక్షలు. నేషనల్ ఫార్మస్యూటికల్ ప్రైసింగ్ అధారిటీ ఆసుపత్రి చార్జీలపై ఒక అధ్యయనం చేసి 2018 ఫిబ్రవరిలో నివేదిక వెలువరించింది. ఢిల్లీ, రాజధాని ప్రాంతంలోని నాలుగు పేరుగాంచిన ఆసుపత్రులు మందులు, వినియోగితాలు, పరీక్షలపైనే 1,737 శాతం లాభం ఆర్జిస్తున్నాయని ఈ నివేదిక తెలిపింది. ఇది పేషెంట్లు ఖర్చు పెట్టే మొత్తంలో దాదాపు సగం ఉంటుంది.

ప్రైవేటు ఆసుపత్రులను నియంత్రించడానికి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 2010 ఉంది. కాని కార్పొరేట్ ఆసుపత్రుల తరఫున నిలబడ్డ బిజెపి కేంద్ర ప్రభుత్వం కాని, రాష్ట్ర ప్రభుత్వాలు కాని ఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయడానికి నిరాకరిస్తున్నాయి.

## పెరిగిపోతున్న ఔషధాల ధరలు

ఔషధ కంపెనీల లాభాలు పెంచేందుకు పూనుకున్న మోడీ ఆధ్వర్యంలో ఔషధాల ధరలపై నియంత్రణను ఎత్తివేయడానికి తీవ్రమైన ప్రయత్నం మొదలైంది. ఔషధ ధరల నియంత్రణ ఆదేశాన్ని, అత్యవసర ఔషధాలను జాతీయ జాబితా నుండి విడగొట్టాలని నీతి ఆయోగ్ 2017 ఏప్రిల్‌లో సిఫార్సు చేసింది. దీని ఫలితమేమంటే, ఇక మీదట అత్యవసర మందులపై నియంత్రణ ఉండదు, వాటి ధరలు విపరీతంగా పెరిగిపోతాయి. అంతేకాకుండా, ఏ అత్యవసరమైనమందునైనా తగినంత పోటీ ఉందని భావించినట్లయితే కేంద్ర ప్రభుత్వం ఔషధ నియంత్రణ నుండి తొలగించవచ్చునని కూడ ప్రతిపాదన చేశారు. ఇదే జరిగితే మొత్తం 350 అత్యవసర మందులలో వేటినైనా ఈ నియంత్రణ నుండి తొలగించవచ్చు. అప్పుడు వాటి ధరలు అపరిమితంగా పెరిగి పోతాయి. ఏ అత్యవసరమందు ధరయినా ప్రస్తుత సీలింగ్ ధర కంటే 10 శాతంగాని అంతకన్నా ఎక్కువగా ధర మార్కెట్‌లో ఉన్న వాటిని మాత్రమే నియంత్రణ క్రిందకు తీసుకు రావాలన్న ప్రతిపాదన కూడ ఉంది. ఈ ప్రతిపాదన ఆమోదించబడితే ఇప్పుడు ధరల నియంత్రణలో ఉన్న 40 శాతం మందులు నియంత్రణ నుండి మినహాయింపబడతాయి.

భరించకలిగిన ధరలకు మందులను సరఫరా చేయాలని ఫార్మస్యూటికల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే జన ఔషధి పథకం ఉద్దేశం. కాని ఈ స్కీముకు ప్రభుత్వం కేటాయించింది కేవలం రూ. 84 కోట్లు మాత్రమే. ప్రస్తుతం ఈ పథకంలో 850 షాపులు నిర్వహించబడుతున్నాయి. 120 కోట్ల జనాభాకు చౌకగా మందులు ఈ నామమాత్రపు మొత్తంతో ఎలా సరఫరా చేస్తారో ఒక్క మోడీ గారికి మాత్రమే తెలుసు.

## క్షీణిస్తున్న ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాలు

నిధుల లేమితో, మోడీ ప్రభుత్వం నుండి రాజకీయ మద్దతు లభించకపోవడంతో ప్రస్తుతమున్న ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాలు వేగంగా క్షీణిస్తున్నాయి. 2017 గ్రామీణ

ఆరోగ్య గణాంకాల ప్రకారం 2017 మార్చి 31 నాటికి సబ్ సెంటర్ల (ఎస్‌సిలు) కొరత 19 శాతం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సిల) కొరత 22 శాతం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సిహెచ్‌సి) కొరత 30 శాతం ఉంది. చాల సెంటర్లు ఎలక్ట్రిసిటీ సదుపాయం లేని, రక్షిత మంచినీటి సదుపాయం లేని, కూలిపోయే భవనాలు లాంటి దుస్థితిలో ఉన్నాయి. సెంటర్లకు సరైనా రోడ్డు సదుపాయం లేక అంబులెన్సులు అక్కడికి చేరుకోలేకపోతున్నాయి.

ఈ కేంద్రాలలో పనిచేసే సిబ్బంది విషయం కూడ ఇలాగే ఉంది. సిహెచ్‌సిలలో స్పెషలిస్టుల (సర్జన్లు, శిశువైద్య నిపుణులు, గైనకాలజిస్టులు, చిన్న పిల్లల వైద్యనిపుణులు, ఫిజీషియన్లు) కొరత 82 శాతం ఉంది. దాదాపు 6371 ఎస్‌సిలు సహాయక నర్సులు, మంత్రసానులు (ఎఎన్‌ఎంలు) లేకుండానే నడుస్తున్నాయి. పోస్టులు శాంక్షను అయినా నియామకాలు మాత్రం జరగడం లేదు. ఉదాహరణకు ఎస్‌సిలు, పిహెచ్‌సిలలో 18 శాతం ఎఎన్‌ఎం పోస్టులు భర్తీ కాకుండా ఉన్నాయి.

పై విషయాలన్నింటిని గమనిస్తే స్వాస్థ్య భారత్, సమృద్ధ భారత్ నిర్మాణం సంగతి అలా ఉంచి ఆరోగ్య రక్షణ వ్యవస్థ దురాశాపరులైన కార్పొరేట్ల నిర్వహణవైపుకు నెట్టివేయబడుతున్నదని అర్థమవుంది. ఇది ప్రజలకు స్వాస్థ్య అంటే మంచి ఆరోగ్యాన్ని అందించదుగాని కార్పొరేట్లకు మాత్రం "సంవృద్ధిని" సమకూర్చిపెడుతుంది.

***

# మోడీ ప్రభుత్వ పాలనలో మరింతగా పెరిగిన ఆహార అభద్రత

**ఈ** నాలుగేళ్ల కాలంలో ఆహార భద్రత గురించి, ఆకలి గురించి ప్రధాని మోడీ అసలు మాట్లాడటంలేదు, మాట్లాడినా చాలాఅరుదుగా. 2017 ప్రపంచ ఆకలి సూచి ప్రకారం 119 దేశాలలో భారత దేశం స్థానం 100. ఆసియాలో కేవలం పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్‌లు మాత్రమే భారత్ కన్నా అధ్వాన్నంగా ఉన్నాయి.

ఆహార భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, విస్తరించడానికి బదులు మోడీ ప్రభుత్వం 2013 జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని నీరుగార్చడానికి, ద్రోహం చేయడానికి ఇప్పుడు అనేక ప్రయత్నాలు చేస్తున్నది.

అసలు ఇప్పుడున్న ఆహార భద్రతా చట్టమే అసమగ్రమైనది, లోపాలతో కూడుకున్నది. ఇది సార్వజనీనమైనది కాదు. ఒక్కో కుటుంబానికి సబ్సిడీ ధరలపై నెలకు 35 కేజీల ఆహార ధాన్యాలను సరఫరా చేయడానికి బదులు ఈ చట్టం ఒక్కో వ్యక్తికి 5 కేజీలే పరిమితం చేసింది. ఈ చట్టం టిపిడిఎస్ క్రింద ప్రాధాన్యతా కుటుంబాలలో గ్రామీణ ప్రాంతాలలో అయితే 75 శాతం, పట్టణ ప్రాంతాలలో అయితే 50 శాతానికే వర్తిస్తుంది. ఈ ప్రాధాన్యతా కుటుంబాలు ఒక్కో వ్యక్తికి 5 కేజీలు, కేజీ ఒక్కింటికి బియ్యం అయితే రూ.3, గోధుమలు అయితే రూ.2, ముతక ధాన్యాలు అయితే రూ.1 చొప్పున పొందవచ్చు. అంత్యోదయ కుటుంబాలు నెలకు 35 కేజీల ఆహార ధాన్యాలు గతంలో ఇచ్చిన తక్కువ ధరలకు కాకుండా సబ్సిడీ ధరలకు మాత్రమే పొందుతారు.

రేషన్ కార్డులకు అర్హులైన పాధాన్యతా కుటుంబాల సంఖ్యను కూడ రాష్ట్రాలు స్తంభింపచేయాలని సర్క్యులర్ పేర్కొంది. "కేంద్ర ప్రభుత్వం లక్షిత ప్రజాపంపిణీ

వ్యవస్థ (టిపిడిఎస్) క్రింద సబ్సిడీ ఆహారధాన్యాలను సరఫరా చేసే వ్యక్తుల సంఖ్యను కుటుంబాల సంఖ్యను ఈ ఆదేశం అమల్లోకి వచ్చిన తర్వాత వెలువడే తదుపరి జనాభా లెక్కల వివరాల వరకు పెంచరాదు." ప్రాధాన్యతా కుటుంబాంలలో తర్వాత పుట్టిన పిల్లలు, ఆర్థిక దుస్థితి వల్ల కొత్తగా ఈ కుటుంబాలలోకి వచ్చిన వారు టిడిపిఎస్ కింద లబ్ది పొందలేరు.

అర్హులైన వారికి రేషన్ కార్డులు తొలగించి సంఖ్య తగ్గించే కార్యక్రమం గత రెండేళ్ల కాలంలో లజ్జారహిత స్థాయికి చేరింది. డిజిటలైజేషన్ పేరుతో, పలు సాకులు చూపించి రేషన్ కార్డులను లక్షల సంఖ్యలో తొలగించారు. తొలగించిన వాటిని ఆ తర్వాత బోగస్ కార్డులని చెప్పారు.

ఇంత కన్నా ఘోరం, రేషన్ కార్డులను ఆధార్ కు అనుసంధానం చేయడం. దీని మూలంగా పెద్ద సంఖ్యలో కుటుంబాలు కార్డులు కోల్పోయి, రేషన్ పొందలేకపోయారు.

దీన్ని ప్రధాన మంత్రి గొప్పగా పార్లమెంటులో చెప్పుకున్నారు. సంక్షేమ పథకాలలో లీకేజీని అరికట్టడానికి, టెక్నాలజీ సహాయంతోను, ఆధార్ నంబర్ల ద్వారాను 3.95 కోట్ల బోగస్ కార్డులను గుర్తించామని ఆయన ప్రకటించారు. అయితే, ఆర్‌టిఐ ద్వారా సమాచారం సేకరించగా, ప్రభుత్వం వద్ద బోగస్ కార్డులను ఎలా తొలగించారు, ఎన్ని కార్డులు తొలగించారుఅన్న వివరాలు లేవని తెలిసింది.

రేషన్ వ్యవస్థలో అవినీతిని అరికట్టాల్సి ఉంది. అయితే దానికి పారదర్శకమైన వెరిఫికేషన్, ఇంటింటికి తిరిగి చేసే సర్వే అవసరం. అలాంటి సర్వే లేకుండానే, పేదలు తమ కార్డులు ఎందుకు రద్దుచేస్తున్నారు అని అడగడానికి కూడ అవకాశం లేని పరిస్థితిలో రద్దుచేస్తున్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన జరిపినపుడు, పొరపాటు సమాచారాన్ని ఎంటర్ చేయడం, ఆధార్‌ను అనుసంధానం చేయడంలో లోపాలు, శ్రామికులు తాత్కాలికంగా వలస వెళ్లడం– కొన్ని ప్రధాన కారణాలని తేలింది.

2017 సెప్టెంబర్, అక్టోబరులో నివేదించబడిన జార్ఖండ్‌లో ఆకలి చావులు మరొక అంశాన్ని వెలుగులోకి తెస్తున్నాయి. సంతోష్ కుమారి అనే పదకొండేళ్ల బాలిక ఆకలి చావుకు గురయింది, ఆ బాలిక కుటుంబానికి రేషన్ కార్డు ఉంది, అయితే అది ఆధార్‌కు అనుసంధానం చేయబడలేదు. ఆ బాలిక నిజం, ఆమె కుటుంబం నిజం, వారి రేషన్ కార్డు సరైనది. ఎన్‌ఎఫ్ఎస్ఏ ప్రకారం ఆ బాలికకు 5 కేజీల బియ్యం వస్తాయి. కాని ఆమె 'భాత్, భాత్' (అన్నం, అన్నం) అంటూ చనిపోయింది.

అదే సంవత్సరం ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం మరొక నోటిఫికేషన్ జారీ చేసింది, "... ఆహార, వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధార్ చట్టం ప్రకారం

నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్ఎఫ్ఎస్ఏ కింద రేషన్ కార్డులున్న వ్యక్తులు తమ వద్ద ఆధార్ కార్డు ఉన్నట్లు రుజువు చూపించాలి, లేదా ఆధార్ ధృవీకరణ జరిగి ఉండాలి, ఎన్ఎఫ్ఎస్ఏ కింద సబ్సిడీలు (సబ్సిడీ ధరలకు ఆహార ధాన్యాలు, లేదా ఆహార సబ్సిడీ నగదు బదిలీ) పొందాలంటే ఇది అవసరం." అని అధికారిక ప్రకటన పేర్కొంది. సంతోష్ కుమారికి ఆధార్ కార్డు లేదు, అందువల్లనే రేషన్ నిరాకరించబడింది, ఆకలి చావుకు గురయింది.

ఆధార్ కార్డులున్న వారికి సైతం రేషన్ నిరాకరించబడుతున్నది. పిఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్లు తరచు పని చేయడం లేదు. వేలి ముద్రలు మ్యాచ్ కాకపోవడం, ఇతర సాంకేతిక సమస్యలు దీనికి కారణం.

రేషన్ పొందడానికి ఇలాంటి షరతులు విధించడం చట్ట విరుద్ధం, ఇది ఎన్ఎఫ్ఎస్ఏ ను ఉల్లంఘించడమే.

సబ్సిడీలకు కోత పెట్టడానికి అసలు కారణం ఈ చట్టాన్ని అమలు చేయడానికి అవసరమైన నిధులే. దీనికి బడ్జెట్ కేటాయింపు రూ. 1.4 లక్షల కోట్లు మాత్రమే, ఇది దేశ జిడిపిలో 1 శాతం కన్నా తక్కువ. ఈ చట్టానికే వ్యతిరేకత వ్యక్తం చేసిన ఆర్థిక మంత్రి ఉన్న ప్రభుత్వం నుండి నిధుల పెంపును ఆశించలేము. రేషన్ కార్డుల సంఖ్యను తగ్గించడం వల్ల ప్రభుత్వం రూ. 17,500 కోట్లు 'పొదుపు' చేయకలిగిందని కేంద్ర ఆహార శాఖ మంత్రి రాం విలాస్ పాశ్వాన్ చెప్పుకున్నారు.

సమర్ధవంతమైన ప్రజాపంపిణీ వ్యవస్థ కలిగిన కేరళ, తమిళనాడు లాంటి రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆహార ధాన్యాల సరఫరాలో తీవ్రమైన కోత విధించింది. ఇది పౌష్టికాహార లోపాన్ని అదుపుచేసిన రాష్ట్రాలలో ప్రజాపంపిణీ వ్యవస్థను దెబ్బతీసింది.

ఆహార ధాన్యాలను ఇవ్వడానికి బదులు, దాని స్థానంలో నగదు ఇచ్చేందుకు, లబ్దిదారులకు నేరుగా బదలాయింపునకు, ఆహార స్టాంపుల విధానానికి మారాలని రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం గట్టిగా వత్తిడి చేస్తున్నది. ప్రపంచబ్యాంకు లాంటి సంస్థలు నయాఉదారవాద విధానాలలో ప్రధాన భాగంగా ముందుకు తెస్తున్న నమూనా ఇది. నగదు బదిలీకి మారేందుకు జార్ఖండ్ లాంటి చోట్ల ప్రభుత్వం అమలు చేసిన పైలెట్ ప్రాజెక్టులు ఘోరంగా విఫలమయ్యాయి. లబ్దిదారునికి నేరుగా అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు. ఎక్కడో దూరంగా ఉన్న బ్యాంకులకు పదే పదే వెళ్లాల్సిన రావడం, విద్యుత్తు లేకపోవడం, ఇంటర్నెట్ లేకపోవడం, వేలిముద్రలు మ్యాచ్ కాకపోవడం – కొన్ని సమస్యలు మాత్రమే. ఆర్థికంగా దుస్థితిలో ఉన్న కుటుంబాలు తమకు లభించే నగదు బదిలీని ఆహార ధాన్యాలపై కాకుండా ఇతర

తక్షణ అత్యవసరాలకు ఖర్చు పెట్టుకుంటానికి సవాలక్ష కారణలుంటాయి. ఇది ఒక సామాజిక వాస్తవం. ఆకలిని అంతం చేయడానికి ఆహార ధాన్యాల స్థానంలో నగదు అనేది ఎంత మాత్రం సరికాదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థకు మంగళం పాడటమే. దీనితో పాటు ఆహార ధాన్యాల ప్రభుత్వ సేకరణ కూడ ఉండదు, ఇది రైతులకు పెద్ద దెబ్బ.

గర్భిణీ స్త్రీలకు రూ. 6000 చెల్లించడం లాంటి వాటితో సహా ఇతర హక్కులు కూడ ఎన్ఎఫ్ఎస్ఏ ద్వారా లభిస్తాయి. గర్భిణీ స్త్రీలకు అవసరమైన అతి కనీస మొత్తం ఇది. ఈ స్పందన లేని ప్రభుత్వం మొదటి రెండేళ్లలో ఈ హక్కును పట్టించుకోలేదు. గత సంవత్సరం ఈ కనీస మొత్తాన్ని రూ. 5000 కు తగ్గించారు, దీనికి ప్రధానమంత్రి మాతృ వందన యోజన అని కొత్త పేరు పెట్టారు. అంతే కాకుండా ఇది మొదటి బిడ్డ సమయంలో మాత్రమే వర్తిస్తుందని ప్రకటించారు. ఇది చట్టానికి పూర్తి విరుద్ధం.

బాలల పౌష్టికాహార హక్కును నెరవేర్చే ఐసిడిఎస్ పథకం అమలు బాధ్యతను ఎన్ఎఫ్ఎస్ఏ మొట్టమొదటి సారి ప్రభుత్వానిదే అని చెప్పింది. దీన్ని సైతం మోడీ ప్రభుత్వం ఉల్లంఘిస్తున్నది. బడ్జెట్ కేటాయింపులను అంతకంతకూ తగ్గించడం ద్వారా ఐసిడిఎస్‌ను క్రమక్రమంగా ప్రైవేటీకరిస్తున్నది. జాతీయ ఆహార భద్రతా చట్టానికి (ఎన్ఎఫ్ఎస్ఏ) ఇది పూర్తి విరుద్ధం.

ఈ ప్రభుత్వ విధానాల ఫలితంగా దేశం మరింత ఆహార భత్రద తీవ్రమైన ప్రమాదంలో పడింది. భారత దేశాన్ని ఆహార భద్రతా దేశంగా చేయాలంటే ఆహార హక్కును సార్వజనీనం చేయాలి. దీని కోసం ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. ప్రజాపంపిణీ ద్వారా ఆహార ధాన్యాలతో పాటు వంటనూనె, పప్పులు, చక్కెర, ఉప్పు లాంటి వాటిని కూడా చేర్చాలి. భారత దేశంలో విస్తారంగా ఉన్న ఆకలి, పౌష్టికాహార లోపానికి ఇదొక్కటే ఉపశమనం కల్పించకలదు.

***

# పర్యావరణ విధ్వంసం

**బి**జెపి 2014 ఎన్నికల ప్రణాళికలో 'పర్యావరణ భద్రత మా ఆలోచనలకు, కార్యాచరణకు కేంద్రంగా ఉంటుంది' అని  చెప్పింది. పర్యావరణ లూటీని చూస్తూ మిన్నకుండమని, వారిని శిక్షనుండి మినహాయించే విధానాలను పూర్తిగా మార్చివేస్తామని కూడా చెప్పింది. కాని ఈ నాలుగేళ్ల పాలనలో దీనికి పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. అసలే బలహీనంగా ఉన్న పర్యావరణ నిబంధనలను మరింత నీరుగారుస్తూ వచ్చింది. 'వ్యాపార సానుకూలత' పేరుతో కార్పొరేట్ సంస్థలకు లబ్ది చేరూకూర్చేందుకు ఇలా చేస్తున్నది. ఎన్నికల ప్రణాళికలో చెప్పిన దానికి పూర్తి భిన్నంగా, పర్యావరణ నిబంధనలు 'అభివృద్ధికి ఆటంకం' అని మోడీ చెబుతున్నారు. కార్పొరేట్‌లకు అనుకూలమైన పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల కల్పనకు ఇది డొంకతిరుగుడుగా మద్దతు పలకడమే.

ఇటీవల తమిళనాడు తూత్తుకుడిలో జరిగిన కాల్పుల సంఘటన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ క్లియరెన్స్‌లు ఎలా ఇస్తున్నది, ఉల్లంఘనలపట్ల ఎలా మిన్నకుంటున్నది స్పష్టం చేస్తున్నది. స్టెర్లైట్ కాపర్ కంపెనీ పాల్పడే వాయు, జల, భూ విష కాలుష్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ప్రజలపై పోలీసులు కాల్పులు జరిపితే కనీసం 12 మంది చనిపోయారు. చట్ట ప్రకారం తప్పనిసరిగా ప్రజా సంప్రదింపులు జరపాలన్న నిబంధనను ఉల్లంఘించినప్పటికీ బిజెపి ప్రభుత్వం స్టెర్లైట్ కంపెనీ స్థాపనను అనుమతించింది.

టిఎస్ఆర్ సుబ్రమణియన్ కమిటీ దుర్మార్గమైన సిఫార్సులను అనుసరించి మొత్తం పర్యావరణ నిబంధనలను తిరగరాయడానికి బిజెపి ప్రభుత్వం పూనుకొంది. పర్యవేక్షణను తగ్గించేందుకు, పర్యావరణ నష్టాన్ని పునర్‌నిర్వచించేందుకు, తేలిగ్గా పర్యావరణ క్లియరెన్స్‌లు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా

ఉన్నపుడు ఈ పనేచేసి భూ కాలుష్యాన్ని, జల వనరుల కాలుష్యాన్ని పెంచేందుకు దోహదపడ్డారు, కార్పొరేట్ సంస్థలను విపరీతంగా సంతోషపెట్టారు. సుబ్రమణియన్ కమిటీ సిఫార్సులను పార్లమెంటు తొక్కిపెట్టినప్పటికీ, అమల్లోఉన్న పర్యావరణ నిబంధనలను, చట్టాలను మోడీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ధ్వంసం చేస్తున్నది. పలు పాలనాపరమైన ఉత్తర్వులు, నోటిఫికేషన్లు జారీ చేస్తున్నది. కార్పొరేట్‌ల ప్రయోజనాలను నెరవేర్చే లక్ష్యంతో పర్యావరణానికి పూడ్చలేనంత నష్టానికి కారణమవుతున్నది. ప్రజల జీవనాధారాల్ని ప్రమాదంలో పడవేస్తున్నది. నీతి ఆయోగ్ ఇటీవల సుబ్రమణియన్ కమిటీ సిఫార్సులను, దానికి ప్రతిస్పందనలను పున:పరిశీలించేందుకు పూనుకొంది. మోడీ ప్రభుత్వం తన పదవీ కాలం ముగిసే లోగా పర్యావరణ నిబంధనలను సంపూర్ణంగా 'మరమ్మత్తు' చేసేటట్టే ఉంది.

## సంస్కరించడమా, నియంత్రణలు ఎత్తివేయడమా!

నయా ఉదారవాద ఆలోచనా ధోరణులు అన్నింటి మాదిరిగానే మోడీ కూడ పర్యావరణ చట్ట సంస్కరణ అంటే పర్యావరణ రక్షణ చట్టాన్ని నిర్మూలించడం, నియంత్రణ సంస్థలను నిరాయుధం చేయడం, పర్యావరణంపై ప్రభావం గురించి ఏ మాత్రం ఆలోచించకుండా పారిశ్రామిక, మౌలిక సదుపాయ ప్రాజెక్టులకు కళ్లు మూసుకొని అనుమతులు మంజూరు చేయడం అనే భావిస్తున్నాడు. ఇంతకుముందు పర్యావరణ రక్షణ చట్టాన్ని ఒకే సారి మొత్తంగా 'సంస్కరించాలన్న ప్రయత్నం విఫలం కావడంతో, ఇప్పుడు ప్రభుత్వం నియంత్రణ నిబంధనలను, యంత్రాంగాన్ని, వ్యవస్థలను నీరుగార్చడానికి పూనుకున్నది; చట్టసవరణలు తేబోతున్నట్టు చెప్పుకుంటూ ఇప్పుడుఉన్న అధికారిక విధానాలను ఉపయోగించుకుంటూ, అవసరమైన చోట్ల నోటిఫికేషన్లు, పాలనా ఉత్తర్వులు జారీ చేస్తున్నది.

పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖలో పర్యావరణ అనుమతులు ఇచ్చే అధికారిక వ్యవస్థను సంపూర్ణంగా అధికారుల అప్పగించారు. వీటిలో స్వతంత్ర నిపుణులు అసలు ఉండటం లేదు, ఒక వేళ ఉన్నా అతి కొద్దిమంది మాత్రమే ఉంటున్నారు. ఈ వ్యవస్థలకు పర్యావరణ అనుమతులు ఇవ్వడమే పనిగా ఉండాలి తప్ప, దరఖాస్తుల తనిఖీ పనిగా ఉండరాదని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీనితో పర్యావరణ అనుమతులు పొందడం లాంఛనంగా మారింది, తనిఖీలు, ప్రశ్నించడాలు అనేవి అరుదైనవిగా మారాయి. దీనికి కొన్ని ఉదాహరణలు.

## మూకుమ్మడి అనుమతులు

పర్యావరణ మంత్రిత్వ శాఖ వద్ద ఉన్న పున:నిర్మించబడిన అనుమతుల కమిటీలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోకుండానే ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేస్తున్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే 140 ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లభించాయి, వాటిలో అత్యధికం పర్యావరణ ప్రభావాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఇవ్వబడ్డాయి. అతికొద్ది కాలంలోనే వందకు పైగా ప్రాజెక్టులకు అటవీ క్లియరెన్స్‌లు మంజూరయ్యాయి. నూతన మార్గదర్శకాలను అనుసరించి అనేక బొగ్గుగని ప్రాజెక్టులకు అటవీ శాఖాఅనుమతులు లభించాయి. గిరిజన, ఇతర అటవీనివాసుల తరలింపు గురించి అసలు పట్టించుకోలేదు. కెన్–బెట్వా లింక్ ప్రాజెక్టుకు అటవీశాఖ మంజూరు దీనికి ఒక ఉదాహరణ. ఈ ప్రాజెక్టు మధ్య ప్రదేశ్‌లోని 6000 హెక్టార్లకు పైగా పన్నా టైగర్ రిజర్వు ప్రాంతాన్ని తీసుకుంటుంది. ఈ ప్రాజెక్టు 1600 కుటుంబాలను నిర్వాసితులను చేస్తుంది, వీరిలో 800 కుటుంబాలు రిజర్వు ప్రాంతంలోనే ఉన్నాయి. 2017 వరకు మోడీ ప్రభుత్వం 570 'ఎ' కేటగిరీ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసింది. ఈ అనుమతులలో అత్యధికం క్షుణ్ణమైన తనిఖీ అవసరం లేని  ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలోనే ఇవ్వబడినాయి.

## నూతన అటవీ విధానం

ప్రభుత్వం ఇటీవలనే నూతన అటవీ విధానాన్ని ప్రకటించింది. ఇది  పర్యావరణ పరంగాను, సామాజిక పరంగాను అనేక విధాలుగా మొత్తం అడవుల స్వభావాన్నే ప్రమాదంలో పడవేస్తుంది. ఇది అడవుల ఆవరణ, చెట్ల ఆవరణ పరస్పరం మార్చుకోదగినవని పేర్కొంటున్నది. కాని నిజానికి రెండూ వేర్వేరు. ఇది ప్రస్తుతం ఉన్న అడవుల అంచుల్లోను, లోపల కూడ తోటలను అనుమతిస్తుంది. దీనిలో ప్రైవేటు రంగానికి ప్రధాన పాత్ర ఉంటుంది. దీని ద్వారా పారిస్ (వాతావరణ) సదస్సు నిర్దేశించిన 33 శాతం అటవీ/చెట్ల ఆవరణాన్ని సాధించడానికి వేగంగా సాగవచ్చునని ఈ విధానం పేర్కొంటున్నది. ఇది స్టీలు, అల్యూమినియం లాంటి అధిక ఇంధన వినియోగ సామాగ్రి నుండి కలపకు మారడానికి దోహదం చేస్తుంది అని కూడ పేర్కొంది.  అడవుల్లో చెట్లను నరకరాదన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులను ఇది స్పష్టంగా దారి తప్పిస్తున్నది. ఈ చెట్లు సహజమైనవి కావు, మనుషులు నాటినవి కాబట్టి నరకవచ్చని ప్రభుత్వం వాదిస్తుంది. ఇదంతా కూడ అటవీ చట్టాన్ని మార్చకుండానే జరుగుతున్నది.

అయితే ఈ విధానం వల్ల రెండు ప్రమాదకర ప్రభావాలు ఉంటాయి. ఇది

మిశ్రమ అడవులకు భిన్నమైనది. ప్లాంటేషన్లు వాణిజ్యపరమైన వృక్షజాతులతో భిన్నంగా ఉంటాయి. వాణిజ్యపరమైన అంశం చేరినపుడు అది పర్యావరణ పరిరక్షణ, సేవల అంశాన్ని పరిగణనలోకి తీసుకోదు. పర్యావరణ భిన్నత్వాన్ని ఇది కాపాడదు, భూకోతను అరికట్టడం, జల, మంచు హార్వెస్టింగ్, ఉపరితల, భూగర్భ జలవనరులను రీచార్జ్ చేయడం దీని దృష్టిలో ఉండదు. కార్బన్ నిల్వ స్వభావం కూడ మిశ్రమ అడవులకే ఎక్కువగా ఉంటుంది. సామాజికంగా చూసినపుడు అటవీ వాసులకు మిశ్రమ అడవులు మాత్రమే వంటచెరకు, పశుగ్రాసం, అటవీయేతర ఉత్పత్తులు అందిస్తాయి. ఇవన్నీ వారి జీవనానికి కావలసినవి. ఈ నూతన విధానం ఇప్పటికే సున్నితంగా మారిన అడవులను ధ్వంసం చేస్తుంది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం కార్పొరేట్లు అడవులను దోపిడీ చేయడానికి ద్వారాలు తెరుస్తుంది.

## కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జెడ్)

మోడీ ప్రభుత్వం చేపట్టిన పర్యావరణ నియంత్రణల మార్పుకు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ నిబంధనలకు ప్రతిపాదించిన సవరణలు మరొక ఉదాహరణ. ప్రస్తుతం అమల్లో ఉన్న 2011 సిఆర్‌జడ్ నోటిఫికేషన్‌కు ఇప్పటికే 11 సవరణలు చేసి నీరుగార్చారు. అభివృద్ధి రహిత ప్రాంతం (నో డెవలప్‌మెంట్ జోన్) పరిధి జనసాంద్రత అత్యధికంగా ఉన్న ప్రాంతంలో తీరం నుండి 100 మీటర్లు, జనసాంద్రత అంత ఎక్కువగా లేని ప్రాంతంలో 200 మీటర్లు ఉండాలని చట్టం చెబుతుంటే, తాజా నోటిఫికేషన్ ఈ పరిధిని అన్ని రకాల కార్యకలాపాలకు 50 మీటర్లకు కుదించింది. భారత దేశ తీర ప్రాంతంలో 3000కు పైగా మత్స్యకారుల గ్రామాలున్నాయి. ఈ 50 మీటర్ల పరిధిలో మత్స్య కారులు తమ ఫిషింగ్ బోట్లు నిలపడంచేపలు, వలలు ఆరబెట్టుకోవడం, ఉప్పుతయారీ, తాత్కాలిక నివాసాలతో సహా అనేక ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తుంటారు. ఈ ప్రాంతంలోనే ఉప్పునీటి కయ్యలు, ఉప్పునీటిలో పెరిగే వృక్షాలు ఉంటాయి. ఈ వృక్షాలు సముద్రం ఆటుపోట్లకు, తుఫాన్లకు తీరం కోతకు గురికాకుండా నిరోధిస్తాయి. తీరం వెంట కోతను నివారించడానికి నిర్మాణాలను, భూ అభివృద్ధిని, ఓడరేవుల, జలమార్గాల డ్రెడ్జింగ్‌ను అనుమతించడానికి మరింత అధ్యయనం అవసరమని 2011 నోటిఫికేషన్ చెప్పింది. కాని 2018 నోటిఫికేషన్ అలాంటి అధ్యయనాల కోసం వేచిచూడకుండానే, ఎకో టూరిజంతో సహా పై కార్యకలాపాలన్నింటినీ గుండుగుత్తాగా అనుమతించింది. ఇదంతా ఈ ఇరుకైన తీర ప్రాంతం పర్యావరణ విధ్వంసానికి గురికావడానికి దారి తీస్తుంది. తీరం వెంట నివసించే లక్షలాది మత్స్య కారుల, ఇతర నివాసితుల ప్రయోజనాలను

దెబ్బతీస్తుంది.

ఏ విధమైన వివరణ లేకుండానే 2018 నోటిఫికేషన్ తీర ప్రాంత జలాలలో కార్యకలాపాలకు, ఉప్పెన ఏర్పడే ప్రాంతాలకు మధ్య తీర ప్రాంతంలో, పర్యావరణ పరంగా సున్నితమైన ప్రాంతాలలో నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని రాష్ట్రాల నుండి, కేంద్రానికి బదిలీ చేసింది. అలలు ఎక్కువ ఎత్తులో వచ్చే ప్రాంతాలను, తక్కువ ఎత్తులో వచ్చే ప్రాంతాలను వేరుచేయడానికి రాష్ట్రాలకు అధికారం ఉంది, ఇలా వేరుచేయడం కోసం అన్ని రాష్ట్రాలకు ఒకే మాదిరి మార్గదర్శకాలను సిఫార్సు చేయవలసిందిగా మాత్రమే కేంద్రాన్ని కోరాయి. కాని 2018 నోటిఫికేషన్ దీన్ని అవకాశంగా తీసుకొని ఈ అధికారాన్ని కేంద్రం అజమాయిషీలో ఉండే ప్రత్యేక ఏజన్సీకి దఖలు పరిచింది. దీనితోపాటు జల, వాయు, అటవీ, తీర తదితర ప్రాంతాలకు వర్తించే నూతన నిబంధనల కోసం నీతి ఆయోగ్ చేస్తున్న కసరత్తును కూడ గమనించాలి. ఈ నోటిఫికేషన్లు, పాలనాపరమైన ఉత్తర్వులు, ప్రభుత్వ ఉత్తర్వులు పర్యావరణ నిబంధనలను ప్రమాదకరమైన రీతిలో మార్పుచేయడానికి ప్రభుత్వం పూనుకున్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

## వాతావరణ మార్పు

పారిస్ వాతావరణ మార్పు సదస్సు సమయంలోను, ఆ తర్వాత పర్యవేక్షించే కసరత్తులోను పేద ప్రజలకు, గ్రామీణ ప్రాంతాలకు తక్కువ కార్బన్ విడుదల చేసే ఏర్పాట్ల కోసం చర్యలు చేపట్టలేదు. విద్యుదీకరణ, వంట ఇంధనం, ప్రజారవాణా పెంపు లాంటి చర్యలు తీసుకోలేదు. ఆధునిక ఇంధన వినియోగ పద్ధతులను బలహీన వర్గాలకు కల్పించాల్సిన అవసరాన్ని విస్మరించి, వలస, కొత్త ప్రాంతాలకు అలవాటు పడటం లాంటి తన విధానాలను కేంద్రం అమలు చేస్తున్నది. ఈ విధానాల వల్ల ఇప్పటికే సంపన్న వర్గాలు అధిక ఇంధనం వినియోగించడం, పేద వర్గాలు అతి స్వల్పంగా ఇంధనాన్ని వినియోగించడం అనే విభజన కొనసాగుతుందని, నిజానికి మరింత తీవ్రమవుతుందని అర్థం చేసుకోవాలి. ఇంధనాన్ని అర్థవంతంగా ఉపయోగించుకునేందుకు ప్రజారవాణాను మరింత విస్తరించాలి. మళ్లీ పునరుద్ధరించలేని ఇంధన వనరులు ప్రజల సంభావ్య అవసరాలు తీర్చడానికి మిగుల్చుకోవాలి. పారిస్ సదస్సు ప్రమాణాలను అందుకుంటున్నట్టు ప్రభుత్వం చెబుతున్నది. కాని ప్రస్తుతం విస్తారమైన ప్రజానీకాన్ని బలవంతంగా తక్కువ ఇంధనం వాడేటట్టు చేసి ఈ లక్ష్యం సాధిస్తున్నది.

***

# నిజమైన శాస్త్రజ్ఞానాన్ని అణగదొక్కుతూ కుహనా శాస్త్రజ్ఞానానికి ప్రచారం

**2**014 ఎన్నికల ప్రణాళికలో బిజెపి 'శాస్త్రీయ విద్య, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహిస్తాను', 'మౌలిక పరిశోధన, నూతన అన్వేషణలు లాంటి వాటిని ముందుకు తీసుకుపోతాను' అంటూ ఎన్నో గొప్ప గొప్ప వాగ్దానాలు చేసింది. అభివృద్ధి ప్రక్రియ, విద్య, విస్తారమైన జనంలో శాస్త్ర జిజ్ఞాసను పెంపొందించడం లాంటి అంశాలలో శాస్త్ర విజ్ఞానం అనేది బిజెపి హయాంలో స్వాతంత్ర్యానంతరం ఎన్నడూ లేనంత కిందస్థాయికి దిగజారింది. ఇది భారత శాస్త్రజ్ఞుల కృషి లోపం వల్ల కాదు, వారి పని నాణ్యత నాసిరకంగా ఉండటం వల్ల కాదు. ఇది సైన్స్ పట్ల ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా వల్ల. గంతలు కట్టుకునే వైఖరి వల్లనే. ఈ నాడున్న ఆధునిక పరిశోధనలు, సైన్సు 'ప్రాచీన భారత దేశంలో' ఎప్పటినుండో ఉన్నాయని, శాస్త్రాలలోనే అన్నీ ఉన్నాయని, వీటిని నేర్చుకుంటే వేరే సైన్స్ అవసరం లేదన్న ఉన్మాద ధోరణి వల్ల ఇది జరుగుతున్నది.

బిజెపి ప్రభుత్వము, దాని సంఘపరివార్ అనుబంధ సంస్థలు ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనా ధోరణులను అణిచివేస్తూ పుక్కిటి పురాణాలను, కుహనా సైన్స్‌ను ప్రచారం చేస్తున్నాయి. గతంలో భారతదేశం సైన్స్, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలు, ఆనాటి పరిస్థితులకు అన్వయించేవే కాకుండా, భవిష్యత్తుకు ఉపయోగపడేవి సైతం విలసిల్లిన చారిత్రక కాలం గురించి తాను సృష్టించిన తప్పుడు చరిత్రను ప్రచారం చేస్తున్నది. ప్రాచీన భారతంలో నిజమైన శాస్త్ర పురోగతిని మాత్రం విస్మరిస్తున్నది. ఇదే సమయంలో ప్రస్తుత శాస్త్ర సాంకేతిక సవాళ్లను స్వీకరించడానికి సిద్ధపడటం లేదు. ప్రపంచ శాస్త్రజ్ఞుల దృష్టిలో భారత దేశం ఎగతాళికి గురయ్యే స్థితి వచ్చింది.

శాస్త్ర సాంకేతిక స్థాయిలో కొన్ని దశాబ్దాల క్రితం భారత దేశంతో సమానంగా ఉన్న దేశాలు పరిశోధన, అభివృద్ధిపై ఖర్చు విషయంలో కాని, సైన్స్ విద్య నాణ్యత

విషయంలో కాని, పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంలో కాని నేడు భారతదేశాన్ని దాటి ఎంతో ముందుకు పోయాయి; ఒక్క అణు, అంతరిక్ష రంగాలు మాత్రమే దీనికి మినహాయింపు.

## పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి)పై నామమాత్రపు కేటాయింపు

ఆర్అండ్‌డి పై కేటాయింపు జిడిపిలో 0.7 శాతానికి దిగజారింది. ఇది అమెరికా కేటాయింపు కంటేనే కాదు, చైనా, దక్షిణ కొరియా, ఇజ్రాయల్‌ల కన్నా కూడ తక్కువ. ఇది అత్యధికంగా రక్షణ, అణు, అంతరిక్ష రంగాలపై మాత్రమే. మౌలిక సైన్స్ పరిశోధన, ఇతర రంగాలలో ఆర్అండ్‌డి వ్యయాలు కునారిల్లుతున్నాయి.

ప్రైవేటు రంగంలో ఆర్అండ్‌డి వ్యయం శాతం పెరుగుతున్నట్లు కనిపిస్తుంది. కాని ఇదంతా బహుళజాతి సంస్థలు పనిచేస్తున్న ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్స్, సాఫ్ట్‌వేర్ రంగాలలో మాత్రమే. భారత పరిశోధనా రంగానికి పెద్దఎత్తున ఎఫ్‌డిఐని ఆకర్షించానని ప్రభుత్వం గప్పాలు కొడుతున్నది. కాని బహుళజాతి సంస్థలు తెచ్చే ఈ పెట్టుబడి ఇక్కడ లభించే భారత నిపుణుల నైపుణ్యాన్ని, చౌకగా లభించే మానవ వనరులను వినియోగించుకోవడానికి మాత్రమే. ఇక్కడ జరుగుతున్నది భారత దేశానికి అవసరమైన పరిశోధన కాదు, ఆ బహుళజాతి కార్పొరేట్ల మాతృసంస్థల అవసరాలకు వినియోగపడేది మాత్రమే.

భారత పేటెంట్లలో భారతీయుల ఆధీనంలో ఉన్నవి వేగంగా తగ్గిపోతున్నాయి. 2001–02లో 40 శాతం ఉన్న భారతీయుల పేటెంట్లు, 2015–16 నాటికి కేవలం 15 శాతానికి పడిపోయాయి. అంతేకాదు, భారత దేశం నుండి దరఖాస్తు చేసుకున్న అమెరికా పేటెంట్లలో 80 శాతం బహుళజాతి సంస్థలకు చెందినవే. దేశంలో ఆర్అండ్‌డి వ్యయం తగ్గిపోవడంతో ఎఫ్‌డిఐ నుండి వచ్చే ఆర్అండ్‌డి ద్వారా వచ్చే పరిజ్ఞానాన్ని, సాంకేతి పద్ధతుల్నీ వినియోగించుకోలేక పోతున్నది. ఇది ఈ రంగంలో ఎఫ్‌డిఐ ని రాబట్టిన లక్ష్యానికే విరుద్ధం. దీనికి భిన్నంగా చైనా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాలలో దూసుకు పోతున్నది.

2017లో తిరుపతిలో జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ లో ప్రసంగిస్తూ ప్రధాని 2022 కల్లా భారత దేశం ప్రపంచంలోనే ఒక వైజ్ఞానిక శక్తిగా ఎదుగుతుందని చెప్పారు. కాని వాస్తవాన్ని గమనిస్తే ఇది కూడ అన్ని ఘనమైన ఇతర ప్రకటనల మాదిరిదేనని అర్థమవుతుంది.

ఇదే సమయంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో ఉన్నత విద్యపైన, పరిశోధనపైన ప్రభుత్వ పెట్టుబడులు క్షీణిస్తున్నాయి. ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తున్నది. విద్యారంగంలో ఎఫ్‌డిఐని ఆహ్వానిస్తున్నది. ఈ ప్రైవేటు సంస్థలు వారి లాభాలు చూసుకుంటాయి తప్ప పరిశోధనపై ఖర్చు పెట్టవు. భారత యూనివర్శిటీలలో ఎప్పుడూ

పరిశోధనకు తగు ప్రాధాన్యత లభించడం లేదు. ఇప్పుడు ఇది పరిమాణంలోనూ, నాణ్యతలోనూ మరింతగా తగ్గిపోతున్నది. ఆర్అండ్డిలో పనిచేస్తున్న భారత శాస్త్రజ్ఞులు, ఇంజనీర్ల సంఖ్య స్తంభించిపోయింది. 2011లో ప్రతి వెయ్యిమందికి 9 మంది ఉంటే, 2015 నాటికి కూడా ప్రతి వెయ్యి మందికి 10 మందికి మాత్రమే ఉన్నారు. చైనాలో ఈ సంఖ్య 47 గా ఉంది.

భారత విశ్వవిద్యాలయాలు పరిశోధనరంగంపై పెడుతున్న ఖర్చు మొత్తం దేశ ఆర్అండ్డి వ్యయంలో 4 శాతం మాత్రమే. ఉన్నత విద్యారంగంలోని శాస్త్ర సాంకేతిక సంస్థలపై వ్యయం తగ్గిపోతున్నది. ఐఐటిలకు మాత్రమే బడ్జెట్ కేటాయింపులు పెరుగుతున్నాయి. ఇది కూడ ఈ రంగంలో కొత్త సంస్థలను స్థాపించడం వల్లనే. శాస్త్ర విద్య, పరిశోధనారంగంలోని భారత సంస్థలకు నిధుల కేటాయింపు 2016లో రు.720 కోట్ల నుండి 2017 నాటికి రు.600 కోట్లకు పడిపోయింది. అత్యధిక మౌలిక పరిశోధనలు జరిగే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కు, కేంద్ర విశ్వవిద్యాలయాలకు ఎలాంటి ప్రోత్సాహం లభించడం లేదు. రాష్ట్రాల విశ్వవిద్యాలయాలలో పరిశోధనా రంగం గురించిన ఆలోచనలు ప్రభుత్వం ఆలోచనల్లో కూడ ఉండటం లేదు.

## విధాన నిర్ణయాలలో శాస్త్ర సాంకేతిక రంగం విస్మరణ

శాస్త్ర సాంకేతిక రంగం అనువర్తిత లేదా అభివృద్ధి పార్శ్వంలో కూడ బిజెపి ప్రభుత్వం గత నాలుగేళ్ల కాలంలో స్మార్ట్ సిటీలు, స్కిల్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా తదితర అనేక పథకాలను ప్రకటించింది. కాని వీటి రూపకల్పనలో శాస్త్ర సాంకేతిక ఇన్‌పుట్లు ఏ మాత్రం గణనీయంగా లేవు. ఘనమైన మేకిన్ ఇండియా స్కీములో కూడ ప్రధాన కేంద్రీకరణ ఎగుమతుల దృష్టితో ఎఫ్‌డిఐని రాబట్టడం పైనే. భారతీయ పరిజ్ఞానంలోను, సామర్థ్యంలోను కీలకమైన ఖాళీలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిని భర్తీచేయడానికి ఎఫ్‌డిఐని వినియోగించడం లేదు. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, సెమి కండక్టర్లు మొదలైన వాటి కోసం దిగుమతులపై ఆధారపడటం దీనికి కొట్టవచ్చే ఉదాహరణ. రక్షణ తయారీ రంగం కూడ ఇవే సమస్యలను ఎదుర్కొంటున్నది. ఈ రంగాలలోకి ఎఫ్‌డిఐ ని ఆకర్షించడానికి ప్రోత్సాహకాలు ఎన్ని పెంచినప్పటికీ వచ్చేవి మాత్రం తక్కువగా ఉన్నాయి. వచ్చిన ఎఫ్‌డిఐలు కూడ సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్యాలను పెంచేందుకు కాకుండా కేవలం లాభాపేక్షతో మాత్రమే వస్తున్నాయి.

ఈ విధంగా భారత యువత తమ అభివృద్ధికి అవసరమైన పరిశోధనకు, శాస్త్ర విజ్ఞానంలో అభివృద్ధి చెందిన పరిజ్ఞానానికి దూరం చేయబడుతున్నారు.

## వెల్లివిరుస్తున్న కుహనా శాస్త్రజ్ఞానం

పైన చెప్పుకున్న దాన్నికి విరుద్ధంగా భారత యువత వెనక్కి లాగబడుతున్నారు.

పుక్కిటి పురాణాలను గుడ్డిగా నమ్మడం, గత చరిత్ర గురించి కుహనా ఆలోచనలతో గర్వించేలా తయారు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సంఘపరివార్ నేతలతో పాటు, మంత్రులు, ప్రధానమంత్రి సైతం గ్రహాంతర యానం చేయగలిగిన అంతరిక్ష నౌకలు, కాస్మటిక్ సర్జరీ, స్టెమ్ సెల్ పరిజ్ఞానం, టెస్ట్ ట్యూబ్ బేబీ తయారీ పరిజ్ఞానం మొదలైనవి కొన్ని వేల సంవత్సరాల క్రితమే ప్రాచీన భారతంలో ఉన్నాయని చెబుతున్నారు. డార్విన్ పరిణామవాద సిద్ధాంతం తప్పని, ఐన్‌స్టీన్‌ను మించిన శాస్త్రీయ సిద్ధాంతాలు వేదాల్లో ఉన్నాయని ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి ప్రకటనలను పదేపదే చేస్తున్నారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ లాంటి వేదికల మీద కూడ ఏమాత్రం వెరపు లేకుండా చెబుతున్నారు. ఈ మాటలకు  నోబెల్ బహుమతి గ్రహీతలతో సహా ప్రఖ్యాత శాస్త్రవేత్తలు పారిపోతున్నారు. శాస్త్రీయ వేదికలమీద ఇలాంటి మాటలను వారు తీవ్రంగా ఖండించి, మళ్లీ ఎప్పుడూ ఇలాంటి సదస్సులకు హాజరు కాబోమని చెప్పి మరీ వెళ్లిపోతున్నారు. భారత శాస్త్రవేత్తలు ఈ మాటలను  ఖండిస్తే వారిని పాశ్చాత్య ధోరణి వంటబట్టిన వారని, జాతి వ్యతిరేకులని, మెకాలే వాదులని విమర్శిస్తున్నారు.

భారత విద్యార్థులు, యువకులు ఏం చేయాలి? వారి భవిష్యత్తుకు అవసరమయిన విమర్శనాత్మక ఆలోచనా ధోరణి, సమస్యల పరిష్కారానికి శాస్త్రీయ ఆలోచనా ధోరణి వారు ఎలా సంపాదించుకోగలుగుతారు? వారు నేర్చుకునే విద్య ఇలాంటి నైపుణ్యాలను అందించేదిగా లేదు; వారిలో ప్రశ్నించే ధోరణిని, పరిశోధనాత్మక ధోరణిని అణచి వేయబడుతున్నాయి. గుడ్డివిశ్వాసాన్ని వారిలో పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

నైపుణ్య సముపార్జన శక్తి సామర్థ్యం, యోగ్యత భారత దేశంలో కాలసినంత ఉంది.  మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయి. అయినా భారత దేశం ఇలాంటి నిస్తేజ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నది.

***